మరాఠిగేట్ గుట్ట.. మటాష్

కూటమి ప్రభుత్వంలో ఆక్రమణలకు, అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పుత్తూరు పట్టణంలోని మరాఠిగేట్ గుట్ట నుంచి అక్రమార్కులు ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలిస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. గుట్టను తొలచడంతో ఏర్పడుతున్న ఖాళీ స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. ముందు పాకలు వేస్తూ సదరు స్థలం తమ ఆధీనంలో ఉందంటూ అనధికార ప్రకటనలతో సొంతం చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ అండతోనే అంతా జరుగుతోందని, అందుకే అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు.





గుట్ట మట్టి తరలిస్తున్న టిప్పర్, (ఇన్‌సెట్) గుట్ట స్థలంలో వెలుస్తున్న పాకలు

- కాసులు కురిపిస్తున్న మరాఠిగేట్ గుట్ట
- మట్టిని తరలిస్తూ ధనార్జన
- పాకలు వేస్తూ స్థలాల ఆక్రమణలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

పుత్తూరు: పట్టణంలోని గుట్టలు, చెరువులు, కాలువలు కబ్జాలకు గురవుతున్నాయి. పట్టణ జనాభా రోజు రోజుకు పెరిగిపోవడంతో పాటు భూ, స్థల అవసరాలు పెరిగిపోతున్నాయి. దీంతో వీటి విలువ రూ.కోట్లకు పెరుగుతోంది. ఇదే అదనుగా ఆక్రమణదారులు పట్టణంలోని ప్రభుత్వ భూములు, గుట్టలను లక్ష్యంగా చేసుకొని దోచేస్తున్నారు. గుట్టల్లో ముందుగా ఎర్రమట్టిని క్యాష్ చేసుకోవడంతో పాటు ఖాళీ స్థలాల్లో పాకలు వేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. పట్టణ పరిధిలోని నందిమంగళం రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నంబర్ 199లో పూరా విస్తీర్ణం 597.81 ఎకరాలు. ఇందులోనే మరాఠిగేట్ గుట్ట, ఎన్జీఓ కాలనీ, ఎన్టీఆర్ కాలనీలతో పాటు, కోనేటిపాళెం గుట్టలు సైతం విస్తరించి ఉన్నాయి. మరాఠిగేట్ గుట్టను ఆనుకొని అమరావతి లేఅవుట్‌కు వెళ్లే రోడ్డు సైతం ఉంది.

నేషనల్ హైవే ముసుగులో దోపిడీ

తిరుపతి–చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇందుకు ఎన్‌హెచ్ వారికి మరాఠిగేట్ గుట్ట నుంచి మట్టిని తరలించుకునేందుకు అధికారులు అనుమతులిచ్చారు. అయితే ఎన్‌హెచ్ పేరిట అక్రమార్కులు ప్రవేశించి మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. స్థానికులు ప్రశ్నిస్తే ఎన్‌హెచ్ పనుల కోసం అంటూ తప్పించుకుని పబ్బం గడుపుకొంటున్నారు. ఈ తంతు రెవెన్యూ అధికారులకు తెలిసే జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా మట్టి తరలింపులతో ఏర్పడిన ఖాళీ స్థలాలపై తైలం మొక్కలను సైతం నాటుతున్నారు. పాకలు వేసి స్థలాలను స్వాధీనం చేసుకొంటున్నారు. పట్టణ పరిధిలో కోట్లు విలువ చేసే ప్రభుత్వ గుట్ట పోరంబోకు భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. కనీసం జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి ఈ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఆక్రమణలు అడ్డుకోకపోతే ఆందోళన తప్పదంటూ హెచ్చరిస్తున్నారు.



ఆక్రమణ భూమిలో నాటిన తైలం మొక్కలు

ఆక్రమణలపై కేసులు తప్పవు



మరాఠిగేట్ గుట్ట వద్ద ఎన్‌హెచ్ వారికి మట్టి తీసుకోవడానికి అనుమతులు ఉన్నాయి. అయితే వారి పేరు చెప్పుకొంటూ అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవు. సిబ్బందిని పంపి, మట్టి రవాణాను పర్యవేక్షిస్తాం .అలాగే ఆక్రమణలకు పాల్పడితే కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటాం. అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

–జీసీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు

క్లుప్తంగా

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

నింద్ర: పోషకాహారం తీసుకుని రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్యామల అన్నారు. మండల కేంద్రమైన నింద్ర అంగన్ వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్యామల మాట్లాడుతూ తల్లీబిడ్డకు పౌష్టికాహారం చాలా ముఖ్యమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం అందరూ తమ పిల్లలకు అందించాలన్నారు. చిన్నతనం నుంచి రక్తహీనత లేకుండా చూడాలని హెల్త్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు అందించే ఆహారంపై అవగాహన కల్పించారు.

అందరికీ వైద్య సేవలందాలి



మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

వడమాలపేట (పుత్తూరు): గ్రామీణ మారుమూల ప్రాంతాల్లోని ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అప్పలాయగుంట సర్పంచ్ ఎస్.శేషాద్రిరెడ్డి పేర్కొన్నారు. శనివారం అప్పలాయగుంట పీహెచ్‌సీలో నారాయణాద్రి ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన స్వస్థ్ నారీ స్వసక్తి అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా మెలగాలని సూచించారు. వైద్య శిబిరంలో పిల్లలు, పెద్దలు 97 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తేజేశ్వరీ, డాక్టర్ పూర్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు పౌష్టికాహారం అవసరం



మాట్లాడుతున్న వైద్యాధికారులు మోహన్‌కృష్ణ, జయకుమార్

పాలసముద్రం: మహిళలు ఆరోగ్యంగా జీవనం సాగించేందుకు పౌష్టికాహారం తీసుకోవడం అవసరమని వైద్యాధికారులు మోహన్‌కృష్ణ, జయకుమార్ తెలిపారు. శనివారం బాలకృష్ణాపురంలో సర్పంచ్ శుభ నేతృత్వంలో స్వస్థ్ నారీ ససక్తి పరివార్ అభియాన్ నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ అందుబాటులో ఉండే ఆకుకూరలు. కూరగాయలు, పప్పు దినుసులు వంటివి ఆహారంలో తీసుకోవాలని సూచించారు. అనంతరం 250 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుబ్రమణ్యం, 104 డీఈఓ శరవణన్ పాల్గొన్నారు.

భూకబ్జాకు యత్నిస్తే చర్యలు



కూటమి నేతలు కబ్జా చేస్తున్న భూమిలో గ్రామస్తులు

వెదురుకుప్పం: భూకబ్జాకు యత్నిస్తే ఎంతటి వారైనా సహించే ప్రసక్తే లేదని, చట్టపరంగా చర్యలు తప్పవని తహసీల్దార్ లోకనాథపిళ్లై హెచ్చరించారు. ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం మండలాల సరిహద్దులోని పిల్లారికుప్పం, ఆళ్ల మడుగు పరిసర ప్రాంతంలో అటవీశాఖ భూమిని కూటమి నేతలు కబ్జా చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు ఆ భూమిలో పశువులు, జీవాలను మేపుకునే పిల్లారికుప్పం, పిల్లారికుప్పం కాలనీ, మూలూరు, మూలూరు ఎస్టీ కాలనీ, మంగుంట, తయ్యూరువాసులు వెంటనే తహసీల్దార్‌కు సమాచారం అందించారు. మేతబీడును ఆక్రమించుకునేందుకు కూటమినేతలు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు.దీనిపై స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కబళిస్తే కేసులు తప్పవని స్పష్టం చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఎం, సహ ఉపాధ్యాయులు

నగరి: మున్సిపల్ పరిధిలోని సత్రం కండ్రిగ ఉన్నత పాఠశాలలో మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న అనిత, లక్ష్మీ శైలజలను ప్రధానోపాధ్యాయులు ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సత్కరించారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో అవార్డు గ్రహీతలను ప్రధానోపాధ్యాయులు, సహ ఉపాధ్యాయులు శాలువలు, పూలదండలతోను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉమాశంకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. అత్యుత్తమ విద్యాబోధన ద్వారా విద్యార్థులకు చేసిన సేవలకే ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు నాదముని, రామరాజు, కే బాబు, పద్మజ, వీఎల్ బాబు, ముని కుమార్, సుమతి, మురళి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద

వెదురుకుప్పం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద తెలిపారు. శనివారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. పరిసరాలను శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ మంగళగౌరి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ వెంకటేష్ పాల్గొన్నారు.

నీటి శుద్ధి యంత్రం వితరణ



నీటి శుద్ధి యంత్రం అందజేస్తున్న దాత సుమన్

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి సుమన్ శనివారం నీటి శుద్ధి యంత్రం వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకమరాజు చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. విద్యార్థులకు సురక్షతమైన శుద్ధి నీటి అందించాలన్న ఉద్దేశంలో నీటి శుద్ధి యంత్రం అందిస్తున్నట్లు దాత పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు దాతను సన్మానించారు.

విజయపురం ఎంపీపీగా మంజుబాలాజీకి బాధ్యతలు



కలెక్టర్ నుంచి అందిన ఉత్తర్వులను మాజీ మంత్రికి చూపుతున్న నాయకులు

నగరి: విజయపురం ఎంపీపీగా మంజుబాలాజీకి పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆర్వోసీ నంబర్ ఈ1/328/2021 మేరకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం నియామక ఉత్తర్వుల పత్రాన్ని వైస్ ఎంపీపీ మంజుబాలాజీ అందుకున్నారు. విజయపురం మండల ఎంపీపీగా ఉన్న టి.జమున ఆరోగ్య సమస్యలతో తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఈ నెల 15వ తేదీన జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు సమర్పించారు. 1994 పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 149 సబ్ సెక్షన్ 1 మేరకు ఎంపీపీకి రాజీనామా సమర్పించే హక్కు ఉన్నందున ఆమె రాజీనామా ఆమోదించి, గెజిట్ 14/2021లోని నిబంధనల మేరకు వైస్ ఎంపీపీకి బాధ్యతలు అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక నాయకులు మాజీ మంత్రి ఆర్కే రోజా నివాసానికి వెళ్లి ఎంపీపీ నియామక పత్రాన్ని చూపారు. అనంతరం మాజీ మంత్రి ఆశీస్సులు పొందారు. పదవిని బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలు అందించాలని మాజీ మంత్రి ఈ సందర్భంగా నాయకులకు సూచించారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

నగరి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఆ మేరకు ఆశా కార్యకర్తలకు పనిభారం తగ్గించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చందామరై డిమాండ్ చేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శనివారం ఆర్డీఓ కార్యాలయం వద్ద సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. అనంతరం ఈ మేరకు ఆర్డీఓ అనుపమకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు వేతనాలు పెంచాలని అనేక పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో చర్చించి, ఆశ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకులు పవిత్ర, విజయలక్ష్మి, రాజేశ్వరి, హంస, వెంకటమ్మ, రేణుక, గీత, నగోమి, ఏఐటీయూసీ నాయకులు మహేంద్ర, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీవారి కటాక్షం



తిరుచ్చిపై విహరిస్తున్న శ్రీవారు

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తమిళ పెరటాసి నెల మొదటి శనివారం కావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకున్న స్వామి అమ్మవార్లకు మంగళ హారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

26 నుంచి ఓటరు జాబితాపై సర్వే

గంగాధర నెల్లూరు: నియోజకవర్గంలో ఈ నెల 26వ తేదీ నుంచి ఓటరు జాబితాపై ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు ప్రత్యేకాధికారి వెంకటశివ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణలను 25వ తేదీ వరకు తహసీల్దార్ కార్యాలయంలో చేపడతామన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు వెల్లడించారు . వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాలలో పనులు చేసుకుంటున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి సవరణలు చేయాలని కోరారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన బూత్‌లెవల్ ఏజెంట్లతో కలసి గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎన్నికల డీటీ సి.మహేశ్వరి, వైఎస్సార్‌సీపీ నేత వెంకట రెడ్డి, టీడీపీ నేతలు స్వామిదాస్, ప్రకాష్, బీజేపీ నేతలు సుధాకర్ , సుందర్ రాజు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గొడుగుల ఊరేగింపు



పుత్తూరులో శ్రీవారి గొడుగుల ఊరేగింపు

పుత్తూరు: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీవారి గొడుగుల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. టీటీడీ వార్షిక బ్రహ్మోత్సవాల నిమిత్తం చెన్నై నుంచి తిరుమలకు వెళుతున్న శ్రీవారి గొడుగులు శనివారం ఉదయం పుత్తూరుకు చేరుకోగానే మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక ఆర్డీఎం గేటు వద్ద శ్రీవారి పాదుకలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివానందస్వామి, బాలకృష్ణారెడ్డి ఊరేగింపును ప్రారంభించారు. అంబేడ్కర్ సర్కిల్, నగరం రోడ్డు, కాపువీధి, బజారువీధి, సుబ్రమణ్యంస్వామి ఆలయం, ధర్మరాజులస్వామి ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది. అడుగడుగునా శ్రీవారి పాదుకలకు భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ యాత్రలో భాగంగా స్థానిక దేవాలయాలకు 4 గొడుగులను బహూకరించారు. కార్యక్రమంలో చెన్నై విశ్వహిందూ పరిషత్‌కు చెందిన రామలింగం, శ్రీనివాసం, తనికవేల్, ఆనంద మహారాజ్ పాల్గొన్నారు.

జంక్ ఫుడ్స్ నిషేధించండి



మాట్లాడుతున్న సీడీపీఓ

నగరి: చిన్న పిల్లలకు ఆహారాన్ని అందించే సమయంలో జంక్ ఫుడ్స్‌ను నిషేధించాలని సీడీపీఓ ఇందిరాప్రియదర్శిని అన్నారు. శనివారం సత్రవాడ అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుగ్గ అగ్రహారం మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా 3–6 ఏళ్ల పిల్లలకు అపార్ ఐడీలు, పౌష్టికాహారం గురించి వివరించారు. గర్భిణులు, బాలింతలు వంటకాల్లో నూనె, ఉప్పు, చక్కెర తక్కువగా వాడాలని తెలిపారు. చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలు జంక్‌ఫుడ్స్ తినకూడదన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోన అరుణగిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ 11 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో వివిధ రూపాల్లో అమ్మవారు దర్శనమివ్వనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

రెండు రోజుల్లో దారి కల్పిస్తాం



చిన్నారుల తల్లులతో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మ సునందన

సాక్షి ఎఫెక్ట్..

గంగాధర నెల్లూరు: స్థానిక దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రానికి రెండు రోజుల్లో దారి సౌకర్యం కల్పిస్తామని సీడీపీఓ పద్మ సునందన తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి దారేది? శీర్షికతో సాక్షి పత్రికలో శనివారం ప్రచురితమైన కథనంపై సీడీపీఓ స్పందించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లల ఇబ్బందులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరిందని, పెచ్చులూడుతోందని చిన్నారుల తల్లులు తెలిపారు. ట్యాంకుకు మరమ్మతు చేయించాలని కోరారు. సీడీపీఓ స్పందిస్తూ.. సమస్యలన్నీ పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

వేడుకగా పెరటాశి శనివారం పూజలు



కరియమాణిక్యస్వామికి ఊంజల్‌సేవ

నగరి: గోవింద భక్తులకు ప్రత్యేకమైన పెరటాశి నెల తొలి శనివారం పూజలు నగరి పట్టణ పరిధిలోని శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయం, సత్రవాడ శ్రీభూనీలా సమేత కరివరదాజ స్వామి ఆలయంలో వైభవంగా నిర్వహించారు. తొలి శనివారం కావడంతో ఉదయం నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కరియమాణిక్య స్వామి ఆలయంలో సాయంత్రం ఊంజల్‌సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. సత్రవాడ కరివరదరాజ స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ వీవర్స్ వింగ్ నేతలు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయాధికారి వెంకటరమణ భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వరిసాగుపై అవగాహన

నింద్ర: వరి సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయాధికారి తులసీరాం అన్నారు. శనివారం మండలంలోని అగరం ఆర్బీకేలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి సాగులో ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించడంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

స్వచ్ఛాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

పుత్తూరు: ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రత్యేకించి విద్యార్థులు స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పలు రకాల పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. మాస్ క్లీన్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాలను, చెత్త కుప్పలు, కాల్వలను, సామూహిక మరుగుదొడ్లను శుభ్రపరచడం జరుగుతుందన్నారు. అలాగే రోడ్లకిరువైపులా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

విద్యార్థులు కళాశాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అనంతరం ప్రిన్సిపల్ చంద్రమౌళి విద్యార్థులతో కలిసి అవగాహనా ర్యాలీ చేశారు. ప్రభుత్వం, ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రత రాష్ట్రాన్ని నెలకొల్పాలని పిలుపునిచ్చారు.

శుభ్రతతోనే ఆరోగ్యం



శుభ్రత పనుల్లో మున్సిపల్ కమిషనర్

నగరి: శుభ్రతను పాటించడంతో ఆరోగ్యం చేకూరుతుందని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్వచ్ఛతాహీ – సేవ, స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సంత మైదానంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేశారు. అనంతరం సత్రవాడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో పురపాలక సంఘ పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి ఓంశక్తి ఆలయం వరకు ర్యాలీ చేసి, మానవహారం ఏర్పాటు చేసి, స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, చుట్టు పక్కల మొక్కలు నా టి పచ్చదనాన్ని కాపాడడంతో స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. శుభ్రతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందన్నా రు. అక్టోబర్–2 నుంచి పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేదిస్తున్నట్లు ప్రకటించారు. మెప్మా పీడీ డాక్టర్ రవీంద్ర, పురపాలక సంఘ శాని టరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయశంకర్, మెప్మా సీఎంఎం ప్రసాద్ పాల్గొన్నారు.

మునగాకులో అద్భుత పోషకాలు



మునగ మొక్క నాటిస్తున్న అధికారులు

గంగాధర నెల్లూరు: గర్భిణులు, బాలింతలు ప్రతి రోజూ మునగాకును ఆహారంలో తీసుకోవాలని, అందులో అద్భుత పోషకాలు ఉన్నాయని జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరి తెలిపారు. శనివారం మండలంలోని మోతరంగనపల్లె, ఆవలకండ్రిగ ఇందిరానగర్ కాలనీ, కోటాగరం, గంగాధరనెల్లూరు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం బాలగంగనపల్లెలో నిర్వహించిన పోషణ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. పిల్లల పెరుగుదలలో పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం ఓ మహిళ ఇంటి పెరట్లో మునగ చెట్టును నాటించారు. సీడీపీఓ పద్మ సునందన, సూపర్‌వైజర్లు అనురాధ, సంగీత పాల్గొన్నారు.

శాంతిభద్రతల రక్షణే లక్ష్యం



ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప

పాలసముద్రం: మండలంలోని శాంతిభద్రతల రక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే 112 నంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో చిన్నపాటి వివాదాలు తలెత్తినా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని, ఎవరూ గొడవలు పడకూడదన్నారు. పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. గంజాయి, తదితర మాదకద్రవ్యాలను విక్రయించినా, వినియోగించినా చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, రికార్డులను తమ వద్దే ఉంచుకోవాలని కోరారు. ప్రకృతి వనరు దోపిడీకి గురికాకుండా ప్రజలు తమకు సహకరించాలని, అందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు.